క్లుప్తంగా

గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణ మిషన్ స్వామీజీ

సీటీఆర్ఐ: మాతా శిశు సంరక్షణ పథకంలో భాగంగా ఆనంద నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. రామకృష్ణ మిషన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 37 మంది గర్భిణులు, బాలింతలతో పాటు 52 మంది మూడేళ్ల లోపు పిల్లలకు డాక్టర్లు వేణుమాధవి, మణికంఠ వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరందరికీ ఉచితంగా మందులు, పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వామి రఘువీరానందజీ, జి.రామారావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయకుమారి పాల్గొన్నారు.

ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

కడియం: మండలంలోని ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి కోరారు. ఆమె మంగళవారం ఈ మేరకు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆధార్, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు, భూమి రికార్డు కాపీలను తీసుకుని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు, సేవలు సులభతరమవుతాయన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీహోమం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడియం: దుళ్లలోని భూ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం లక్ష్మీహోమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు పర్యవేక్షణలో వేద పండితులు, భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ అనంతరం హనుమంత వాహనంపై స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిపారు. భారీ ఎత్తున గ్రామస్తులు కార్యక్రమానికి హాజరయ్యారు.

యూదుల సంప్రదాయంలో వివాహం



యూదుల సంప్రదాయంలో వివాహం జరిపిస్తున్న ఇజ్రాయెల్ రబ్బీలు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి బార్లపూడి కల్యాణ మండపంలో మంగళవారం యూదుల సంప్రదాయంలో వివాహం జరిగింది. బెనయ్ ఎఫ్రాయిమ్ సంస్థ అధ్యక్షుడు రబీ యెహోషువ యాకోబీతో కొవ్వూరుకు చెందిన సిప్పోరా యాకోబీకి ఈ పెళ్లి చేశారు. ఇజ్రాయెల్‌కు చెందిన రబ్బీ ఎల్నాయు బీస్‌బామ్, రబ్బీ యారోన్ గిలోర్, రబ్బీ డా.గ్రీన్ అరిగ్రీన్ స్పానర్వీ వివాహం జరిపించారు. అనంతరం బెనెయ్ ఎఫ్రాయిమ్ సంస్థ వార్షిక సమావేశం జరిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే హీదోన్ హతనాక్ నోవహియ బైబిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సినిమాలు



శ్యామల	:	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	:	బడాస్ రవికుమార్
సూర్యప్యాలెస్	:	పట్టుదల
స్వామి	:	సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	:	తండేల్
అనుశ్రీ	:	ఒక పథకం ప్రకారం, మదగజరాజ
రాజా	:	తండేల్
ఊర్వశి	:	డాకు మహారాజ్
మేనక	:	గేమ్‌ఛేంజర్
రంభ	:	ఒక పథకం ప్రకారం, మార్కో
కుమారి	:	తండేల్
అప్సర	:	తండేల్
అశోక	:	పట్టుదల
నామవరం		
వీఎస్.మహల్ ధవళేశ్వరం	:	తండేల్
మురళీకృష్ణ కడియం	:	తండేల్
వెంకటసూర్య	:	తండేల్

పక్కా ప్రణాళికతో చక్కని మార్కులు

- పబ్లిక్ పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు సిద్ధం
- ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- అన్ని అంశాలపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. వారి భవిష్యత్తును మలుపు తిప్పేది కూడా ఈ తరగతే. దీనిలో వచ్చిన మార్కుల ఆధారంగా పైచదవులు ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించడానికి కృషి చేయాలి. ఈ ఏడాది మార్చి 17 నుంచి టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో వారు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. బాగా చదివేలా ప్రోత్సహిస్తున్నారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మార్కులు 'పది'లం అయ్యేలా తీర్చిదిద్దుతున్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని 20 ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,804 మంది విద్యార్థులు, అలాగే రూరల్ మండలంలోని 15 పాఠశాలల్లో 1,194 మంది, కడియం మండలంలో తొమ్మిది పాఠశాలల్లో 6,95 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నారు. సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు.



బొమ్మూరు జీపీఆర్ హైస్కూల్లో ప్రీఫైనల్ పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

నూరుశాతం ఫలితాలే లక్ష్యం



నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మ్యాప్ పాయింటింగ్, బిట్లు, ఒక్క మార్కు ప్రశ్నలపై ప్రత్యేక దృష్టి పెడితే సులభంగా పదికి పది పాయింట్లు సాధించవచ్చు. బిట్ పేపరులో జవాబులు రాసేటప్పుడు తప్పులు, కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. పరీక్ష హాల్లో ఇచ్చిన ప్రశ్నపత్రాన్ని విద్యార్థులు ఒకటికి రెండుసార్లు అర్థమయ్యేలా చదువుకోవాలి.

–ఎం.నరసింహారెడ్డి, హెచ్ఎం, జీపీఆర్‌జెడ్పీహెచ్ఎస్, బొమ్మూరు

ఆంగ్లంపై అవగాహన అవసరం



ఇంగ్లిషు పరీక్ష ఒకే పేపర్‌పై వంద మార్కులకు ఉంటుంది. సెక్షన్ -ఏరీడింగ్, కాంప్రహెన్షన్, సెక్షన్-సి క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్లకు ఒక్కోదానికి 30 చొప్పున 60 మార్కులు ఉంటాయి. సెక్షన్-బీలో వకాబులరీ, గ్రామర్ కలిపి 40 మార్కులు ఉంటాయి. వీటిని ఉపాధ్యాయుల సహాయంతో సందేహాలను నివృత్తి చేసుకుంటూ సాధన చేయాలి. ప్రశ్నలను వరసగా రాయడం, ప్రశ్నల నంబర్లను సక్రమంగా వేయడం, కొట్టివేతలు లేకుండా రాయడం చాలా ముఖ్యం.

– సీహెచ్.పద్మశ్రీ, ఇంగ్లిషు టీచర్, బొమ్మూరు

గణితంలో సాధన ముఖ్యం



గణితంలో పూర్తి మార్కులు సాధించడానికి సాధన చాలా ముఖ్యం. సూత్రాలు, త్రిభుజాలను బాగా నేర్చుకోవాలి. అంకమధ్యం, మధ్యగతం, బాహుళకంను బాగా సాధన చేస్తే సులభంగా మంచి స్కోర్ వస్తుంది. గణిత పుస్తకంలో ఉండే 14 చాప్టర్ల నుంచి 8 లేక 9 చాప్టర్లను సింపుల్ పద్ధతిలో రివిజన్ చేయడం శ్రేయస్కరం. వాస్తవ సంఖ్య, బహుపదులు రెండు చరరాసులలో రేఖీయ సమీకరణాలు, జత, నిరూపక, జ్యామితి త్రికోణం అనువర్తనాలు, వృత్తాలు, సమన్విత వైశాల్యాలు, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత అనే తొమ్మిది అధ్యయనాల నుంచే మంచి మార్కులు వస్తాయి.

– సీహెచ్ కన్నమ నాయుడు, స్కూల్ అసిస్టెంట్ గణితం, చున్నీలాల్‌జాజు స్కూల్

అర్థమయ్యేలా రాస్తే మార్కులు మీవే



పాఠ్యపుస్తకాల ఆధారంగా తొలిసారి జరుగుతున్న పరీక్షల్లో జనరల్ సైన్స్ పేపర్-1 (భౌతిక రసాయన శాస్త్రం) 50 మార్కులకు ఉంటుంది. దీనిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడం చాలా తేలిక. బాష్పీభవనం, అశ్వదృష్టి, దీర్ఘదృష్టి లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు విధానం, విద్యుత్ మోటార్, ఏసీ జనరేటర్, డీసీ జనరేటర్ పనిచేసే విధానాలు, క్వాంటమ్ సంఖ్యలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం, ఆమ్లాలు, లవణాలు, కాంతి పరావర్తనం, వక్రీభవనం తదితర వాటిని బాగా చదవాలి. ఎనిమిది మార్కుల ప్రశ్నలలో పటాలు వేస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

– ఏ.ఇందిర, ఫిజికల్ సైన్స్ ఎస్ఏ, హుకుంపేట హైస్కూలు

ప్రశ్నను అర్థం చేసుకోవాలి



ప్రశ్నాపత్రం ఒక్కటే అయినప్పటికీ జవాబు పత్రాలు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం వేర్వేరుగా ఇస్తారు. ఇందులో జీవన విధానాలు (విసర్జన) నియంత్రణ, సమన్వయం, ప్రత్యుత్పత్తి, పటాలను (బొమ్మలు)సాధన చేయాలి. పట్టికలు, పేరాగ్రాఫ్ రూపంలో ఉన్న అంశాలను బాగా చదివిన తర్వాత సంబంధిత మాదిరి ప్రశ్నలకు సమాధానం రాయడం సాధన చేయాలి. ప్రయోగాలు, కృత్యాలు, పేరాలు, భేదాలు రాయడం వంటి అంశాలను అవగాహనతోనే అధ్యయనం చేయాలి. ఏదైనా ఒక అంశం గురించి నినాదాలు, ప్రశ్నలు తయారీపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలి.

– వీవీఆర్‌కే రత్నం, బయాలజీ స్కూల్ అసిస్టెంట్, పిడింగొయ్యి హైస్కూల్

జవాబులు సంపూర్ణంగా రాయాలి



తెలుగులోని పద్య పాఠాంశాల్లో తేటగీతి, ఆటవెలది, కంద పద్యాలను (నీతిగలవి) చూసుకుంటే సరిపోతుంది. జవాబులను సంపూర్ణ వ్యాఖ్యాలుగా రాయాలి. ప్రశ్నలు తయారు చేసేందుకు ప్రశ్నార్థక పదాలు (ఎవరు, ఎవరికి, ఏమిటి, ఎలా, ఎందుకు)గుర్తించుకుని తయారు చేయాలి. పరిచిత గద్యానికి, గద్యాంశ పాఠాలు చేసుకోవాలి. సృజనాత్మకతతో పద్య భాగం నుంచి కవి పరిచయాలు, గద్య భాగం నుంచి నేపథ్య ప్రక్రియలు చూసుకుంటే సరిపోతుంది. విరామ చిహ్నాలు పాటించడంతో పాటు మంచి దస్తూరితో మార్కులు సాధించవచ్చు.

– జి.రోజారత్నకుమారి, తెలుగు ఎస్ఏ, శాటిలైట్‌సిటీ హైస్కూలు

హిందీలో మార్కులు సులభమే



హిందీ పాఠ్య పుస్తకం కొత్తది. ప్రశ్నాపత్రంలో మొత్తం ఆరు భాగాలు ఉంటాయి. ఇందులో భాషాకిబాత్, అర్థ గ్రాహ్యత, ప్రతిక్రియ, కవుల జీవిత చరిత్ర, ఉపవాచకం, పద్య, గద్య భాగం, అపర విభాగంగా ఉంటాయి. మొదటి భాగంలో 12 ప్రశ్నలు వ్యాకరణానికి సంబంధించినవి కాగా, సరళమైన వ్యాకరణాలు నేర్చుకొని పట్టిక తయారు చేసుకోవాలి. 2వ భాగం ప్రశ్నల్లోని కీలక పదాన్ని ప్యాసేజ్‌లో వెతికి సమాధానం గుర్తించవచ్చు. 3వ భాగంలోని కవి పరిచయాల్లో కబీర్ దాస్, మీరాబాయి నేర్చుకుంటే సరిపోతుంది. 4వ భాగంలోని 8 ప్రశ్నల్లో ఆరింటికి సమాధానాలను నాలుగు వాఖ్యాలలో రాయాలి. ఒక వ్యాసాన్ని ఉప శీర్షికతో పది వ్యాఖ్యాలకు తగ్గకుండా చూసుకోవాలి.

– వై.రాధాంజలి, హిందీ ఎస్ఏ, శాటిలైట్‌సిటీ

మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి సాధ్యమని జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వంతో పాటు స్వర్ణాంధ్ర లాంటి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం జరిగిన 76వ బ్యాచ్ కుట్టుశిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆ బ్యాచ్‌లో ఉత్తీర్ణులైన సుమారు 50 మందికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. అలాగే 77వ బ్యాచ్ తరగతులను లాంఛనంగా ప్రారంభించారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సంధ్యారాణి

కాటినీ వదలని కూటమి నాయకులు

- రూ.2 లక్షల విలువైన 30 వేపచెట్ల నరికివేత
- క్రైస్తవ శ్మశాన వాటికలో ఘటన

రాజమహేంద్రవరం రూరల్: దోపిడీలో ఆరితేరిన కూటమి నాయకులు శ్మశానాన్ని కూడా వదలడం లేదు. అందిన కాడికి దోచుకుని సొమ్ములు చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. రూరల్ మండలం బొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలో క్రైస్తవ శ్మశాన వాటికలోని వేపచెట్లపై కూటమి నాయకుల కన్నుపడింది. దాదాపు రూ.రెండు లక్షల విలువైన 30 చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరికి తరలించుకుపోయారు. సాధారణంగా చనిపోయిన చెట్లను తొలగించడం పరిపాటి. అయితే పచ్చని చెట్లను కూడా నరికి మాయం చేయడంపై ప్రజలు విస్తుపోతున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంటూ కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో దానికి విరుద్ధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్నారు. ఏ ఉద్దేశంతో ఈ చెట్లను నరకాల్సి వచ్చిందని పంచాయతీ, రెవెన్యూ, ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎటువంటి స్పందన కానరాకపోవడం ఈ దోపీడీకి ఆయా శాఖల అధికారులు మద్దతు కూడా ఉందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.



శ్మశానంలో వేపచెట్లు నరికివేయడంతో మిగిలిన మోడులు

ఉద్యోగాలకు 39 మంది ఎంపిక

కంబాలచెరువు: తాడితోటలోని సంహిత డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ తోట రామకృష్ణుడు ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా షెడల్ ప్రో టెక్నాలజీస్ కంపెనీ హెచ్ఆర్ సయ్యద్ పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు జరిపారు. కళాశాల విద్యార్థులు 81 మంది హాజరు కాగా వారిలో 39 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ సభ్యులు కేవీ రాజేష్, డీవీవీ సతీష్, పి.హర్షిత సునందిని, కళాశాల ఏవో జి.బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళావాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది, ప్రిన్సిపాల్ తోట రామకృష్ణుడు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ఆరోగ్యకర సమాజానికి చర్యలు

కంబాలచెరువు: సమాజంలో అందరూ ఆరోగ్యవంతులుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. మన పిల్లలకు ఎటువంటి లోపాలు ఉండకూడదని కోరుకుంటూ, దానిలో భాగంగా హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలోనూ జిల్లా ప్రారంభ జోక్యం కేంద్రాలు (డీఈఐసీ సెంటర్లు) ఏర్పాటు చేసి, వాటి ద్వారా సర్వే చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డోర్ టు డోర్ క్యాంపెయిన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, డీఎంఅండ్‌హెచ్ఓ, జిల్లా లీగల్ అథారిటీ సెక్రటరీ, మండల సెక్రటరీలతో ఒక టీమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జిల్లాకు ఈ టీములను పర్యవేక్షణ కోసం పంపి, వారి ద్వారా అక్కడ దివ్యాంగులు పిల్లలు గుర్తిస్తామన్నారు. ఫిబ్రవరి 10న మొదలైన ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతుందన్నారు. డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సొసైటీ కింద ఉన్న తూర్పుగోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాలకు సంబంధించిన ప్రాంతాలలో నమోదైన కేసులు రిఫరెన్స్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు వైద్య సేవలు అందించే విభాగాన్ని సందర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (ఇన్‌చార్జి) ఎస్‌కే జానీబాషా, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి కె.విజయ కుమారి, డీఈఐసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.హరిచంద్ర ప్రసాద్, పిల్లల వైద్యురాలు డాక్టర్ ఇంద్రజ, డీఈఐసీ గవర్నమెంటు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో చిన్నారిని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

జీతం బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ పరిధిలోఇంటింటి చెత్త సేకరణకు (సీఎల్ఏపీ) పథకంలో పనిచేస్తున్న 82 మంది ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు బి.పవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం క్వారీ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పవన్ మాట్లాడుతూ తక్కువ జీతాలతో పనిచేసే డ్రైవర్లకు మూడు నెలల జీతాలను నిలిపివేస్తే, వాళ్లు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ఎన్నికల ప్రచారం

కడియం: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా కడప ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, డొక్కా నాథ్‌బాబు, ఎం.తేజోవతి, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉద్భవ్ 2025 వెబ్‌సైట్ ఆవిష్కరణ

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ - 2025 వెబ్‌సైట్‌ను అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఈ నెల 20, 21, 22 తేదీలలో ఉద్భవ్ - 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులను ఒకచోట చేర్చి వారి ప్రతిభ, సృజనాత్మకత, ఆవిష్కరణలను సాంస్కృతిక, విద్య, సహ పాఠ్య కార్యక్రమాల ద్వారా వెలుగులోకి తీసుకురానున్నామన్నారు. ఈ సందర్భంగా నాలుగు ఆన్‌లైన్, ఆరు ఆఫ్‌లైన్ పోటీలు జరుగుతాయన్నారు. కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉద్భవ్ -2025 వెబ్‌సైట్ అయిన డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏసీ.ఇన్‌ను సందర్శించాలన్నారు.

కరాటే విజేతలకు అభినందనలు

ప్రకాశం నగర్: కాకినాడ ఇంద్రపాలెంలోని సుబ్బిరామిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇటీవల నేషనల్ కరాటే పోటీలు జరిగాయి. వాటిలో కటాస్ స్పరింగ్ అండర్ 12, 19 విభాగాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా వారిని బుధవారం ఎస్పీ నరసింహ కిశోర్ తన కార్యాలయంలో అభినందించారు. పోటీల్లో సీహెచ్ నిషిత్, ఎం.ప్రసన్న వెంకట నాగ సూర్యశ్రీ బంగారు పతకాలు, ఆర్.మనోజ్ఞ, డి.చిన్మయ, వి.ఇందు, సీహెచ్ సునంద వెండి పతకాలు, కె.చరణీకృతి, జి.స్టీఫెన్ రాహుల్, కె.రుత్విక్, వి.అఖిల్ తేజ్‌లు కాంస్య పతకాలు సాధించారు.

ఆ చట్టం జోలికి వస్తే సహించేది లేదు

ప్రకాశం నగర్: గిరిజనుల జీవనాధారమైన 1/70 చట్టం జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గిరిజన, ఆదివాసీ, రైతు కూలీ, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆ చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 11, 12 తేదీల్లో జరుగుతున్న రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బంద్‌కు సంఘీభావంగా బుధవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ, అఖిల భారత రైతు కూలీ సంఘం పల్లా వెంకట్ నాయుడు మాట్లాడుతూ అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలను ఊరుకోబోమని స్పష్టం చేశారు.

డివిజన్లలో సమస్యలను గుర్తించాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రత్యేకాధికారులు డివిజన్లలో విస్తృతంగా పర్యటించి, సమస్యలను గుర్తించడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడంతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం డివిజన్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమించిన విషయం తెలిసిందే. వారందరికి కొన్ని విధులు కేటాయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన విధులను తప్పనిసరిగా నిర్వర్తించాలన్నారు. ప్రతి రోజూ డివిజన్‌లో సచివాలయ కార్యదర్శులతో కలిసి తిరిగి సమస్యలను గుర్తించాలన్నారు. వాటి పరిష్కారానికి సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌ను ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నకిలీ విత్తనంతో అన్నదాతల దిగాలు

మధురపూడి: ఆరుగాలం శ్రమించి, పంట పండించి, అందరికీ అన్నం పెడుతున్న రైతులను కొందరు విత్తన వ్యాపారులు మోసం చేస్తున్నారు. అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించక పోవడాన్ని అవకాశంగా తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటన కోరుకొండ మండలం గాదరాడలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గాదరాడ, నరసాపురం గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు ఈ రబీ సీజన్‌లో 2 వేల ఎకరాల్లో వ్యవసాయం చేశారు. దీనిలో భాగంగా ఆర్ఎన్ఆర్ 15048 విత్తనాన్ని చల్లారు. కానీ ఇవి నకిలీ విత్తనాలు కావడంతో ముందే ఈనిక దశకు వచ్చాయి. సాధారణంగా రెండు నెలల తర్వాత ఈనిక దశకు రావాలి. దానికి విరుద్ధంగా నెల రోజులకే ఈనిక దశకు పొలం చేరుకుంది. దీని వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఎందుకంటే ధాన్యపు గింజ పాలిపోవడంతో పాటు నాణ్యత దెబ్బతింటుంది.

రైతుల ఫిర్యాదు

ఆ విత్తనం వాడిన రైతులందరూ కాపవరం గ్రామానికి చెందిన దేవీ ఏజెన్సీ యజమానిని సంప్రదించగా సరైన సమాధానం రాలేదు. దీంతో రైతులందరూ గాదరాడ రోడ్డుపై బైఠాయించారు. అలాగే వ్యవసాయశాఖ, ఎంపీడీఓ, రెవెన్యూశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. రైతులు మైరెడ్డి సూరిబాబు, రాంబాబు, పంచాది వీర వెంకట సత్యనారాయణ, పందుళ్ల మణికంఠ, సర్వేశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం వ్యవసాయశాఖ జిల్లా అధికారులు కాపవరం దేవీ ఏజెన్సీస్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే పంట పొలాలను కూడా పరిశీలించారు. ఆ కంపెనీ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్ఎన్ఆర్ కంపెనీ మేనేజర్ ఈ నెల 14వ తేదీన రైతులతో చర్చించడానికి రానున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, డాట్ సెంటర్ శాస్త్రవేత్త కె.శ్రీనివాస్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జునరావు, ఏఓ గౌరీదేవి పాల్గొన్నారు.



నకిలీ విత్తనాలతో ఈనిక దశకు వచ్చిన పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

స్వర్ణకారుడికి ఏడాది జైలు

కంబాలచెరువు: ఆభరణాలు తయారు చేయాలని ఖాతాదారులు ఇచ్చిన బంగారంతో పరారైన స్వర్ణకారుడికి మూడో ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి కె.రమ్య ఏడాది జైలు శిక్ష వేస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. గంచి మదన్‌లాల్ బంగారు వస్తువులను తయారు చేస్తుంటాడు. అతడికి 2015లో రాజేంద్ర ప్రసాద్‌తో పాటు మరికొందరు బంగారాన్ని ఇచ్చి వస్తువులను తయారు చేయమన్నారు. అయితే మదన్‌లాల్ ఆ బంగారంతో పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టుకు సాక్ష్యాధారాలను అందించారు. కేసును ఏపీపీ సీహెచ్ రాజశేఖర్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ కొండబాబు కేసుకు సంబంధించి సాక్షులను, వివరాలను అందించారు.

కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

రాజానగరం: చాలీచాలని జీతాలతో రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న తమను, తమ సేవలను గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని వీఆర్ఏలు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వానికి ఈ మేరకు తమ విన్నపాన్ని తెలియజేయాలని తీర్మానించారు.